క్లుప్తంగా

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కంచిలి: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వైఎస్సార్ కేపీ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. హోల్డ్ స్పి ట్ ఆప్షన్ ద్వారా వాస్తవంగా అర్హులైన వారికి పథకాలు అందేటట్లు చేయవచ్చన్నారు. ఇంటి పన్ను వసూళ్లను త్వరితగతిన చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఏపీఎం పి.ఉమారాణి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



మోహన్‌కు సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఒడిశా పరిధి అంతరసింగి గ్రామానికి చెందిన యువకుడు కల్యాణ్ నోటి క్యాన్సర్‌తో బాధపడున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు మోహన్‌కు ఆరు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. మోహన్ పొట్టకూటి కోసం ఢిల్లీలోని ఓ కంపెనీలో పని చేస్తున్న సమయంలో క్యాన్సర్ బారినపడ్డాడు.

సామాజిక తనిఖీకి సహకరించాలి



మాట్లాడుతున్న సింహాచలం

ఇచ్ఛాపురం రూరల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన పనులపై నిర్వహించనున్న సామాజిక తనిఖీకి ఆయా బృందాలకు అధికారులు సహకరించాలని సీఆర్పీ సింహాచలం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులు, సామాజిక తనిఖీ బృందంతో శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం తరఫున చేసిన ఖర్చులు, లావాదేవీలు, వేతనాలు, పనులు, బిల్లులకు సంబంధించి పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కె.రామారావు, ఏపీవో పి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యంలో కీర్తన ప్రతిభ



నాట్యం చేస్తున్న కీర్తన

మందస: కూచిపూడి నాట్యంలో మందస విద్యార్థిని నారాయణశెట్టి కీర్తన ప్రతిభ చూపింది. కర్ణాటకలోని హుబ్లీలో ఇటీవల జరిగిన జాతీయ యువజన ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొంది. శ్రీసాయిమెహర్ నృత్య కళానికేతన్‌లో శిక్షణ పొందుతున్న కీర్తన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రోత్సాహక బహుమతి అందుకుంది. ఈమెను సోషల్‌వర్కర్ గిన్ని తిరుపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, వ్యాపారవేత్త ఇప్పిలి వెంకటేశ్వరరావు అభినందించారు.

బాలికల హక్కులను కాపాడుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: బాలికల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రధానోపాధ్యాయురాలు వాసంతి పట్నాయక్ అన్నారు. జాతీయ బాలికల వారోత్సవాల్లో భాగంగా శనివారం బిర్లంగి ఉన్నత పాఠశాలలో 'బేటి బచావో..బేటి పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్యవివాహాలు, బాలికల సంరక్షణ, గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ అనిత, పీఎంసీ చైర్మన్ రబీంద్ర రౌళో, వైస్ చైర్‌పర్సన్ పార్వతి, బిర్లంగి, బి.తోటూరు, సైదాల పుట్టుగ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమమే ధ్యేయం



సరియాపల్లిలో వృద్ధురాలు చెలియా జమ్మాతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- సరియాపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మందస: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను చేరవేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని ఉద్దాన ప్రాంతమైన సరియాపల్లిలో సర్పంచ్ బత్తిని వెంకటరావు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబాన్ని నవరత్నాలతో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అభివృద్ధి పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గతంలో సీఎం జగనన్న ఉద్దానంలో పర్యటించినప్పుడు ప్రజల కష్టాలను కళ్లారా చూశారనన్నారు. ఉద్దానవాసులు కిడ్నీవ్యాధితో పడుతున్న కన్నీటి బాధలను అర్థం చేసుకుని.. వారి కష్టాలను తీర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. తిత్లీ తుపాను నష్టపరిహారం రెట్టింపు ఇప్పటికే అందజేయడం జరిగిందన్నారు. రూ.కోట్ల వ్యయంతో కిడ్నీవ్యాధి మూలాలు పరిశోధించడానికి పరిశోధనా కేంద్రం, ప్రతి ఇంటికీ మంచినీటిని సమకూర్చుతున్నామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉద్దానం ప్రాంతానికి ఉన్న అభిమానాన్ని అలాగే కొనసాగించాలన్నారు. సరియాపల్లి పంచాయతీలో ఇంటింటికీ పర్యటించిన మంత్రి సీదిరి వారికి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబంలోని వ్యక్తులకు వ్యక్తిగతంగా ప్రభుత్వ సాయం ఎంత అందుతుందో తెలియజేశారు. అర్హులకు పథకాలు అందకపోతే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భం ఒక కోటి రూపాయలతో నిర్మించిన సరియాపల్లి నుంచి అలేఖ్యనగర్ తారురోడ్డు, నాడు–నేడుతో నిర్మించిన భవనాలను మంత్రి ప్రారంభించారు. సరియాపల్లి సమస్యలను తెలుసుకోవడానికి పల్లెనిద్రను చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీరప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఎంఈవో ఎం.లక్ష్మణరావు, ఏఈలు కణితి కృష్ణారావు, గారరామ్మోహనరావు, ఈఓపీఆర్డీ ఐవీ రమణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగ రాత పరీక్షలకు ఏర్పాట్లు



టెక్కలి రూరల్: విధుల కేటాయింపు ప్రక్రియలో పోలీస్ సిబ్బంది

టెక్కలి రూరల్: టెక్కలిలోని 14 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించనున్న కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్ష కోసం సంబంధిత అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు శనివారం స్థానిక అదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో టెక్కలి పోలీసులు పరీక్షల కోసం తీసుకునే చర్యలపై సమీక్షించారు. సిబ్బందికి కేంద్రాల వారీగా విధులు కేటాయించారు. పరీక్ష రాసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. టెక్కలి రిజనల్ పరిధిలోని నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస పరిధిలోని పోలీసులు ఇందులో పాల్గొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎవరూ తిరగకుండా చూడాలని, అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ (డీటీసీ) జి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

కోటబొమ్మాళి: పోలీసు ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు స్థానిక ఎస్సై షేక్‌ఖాదర్ బాషా తెలిపారు. కోటబొమ్మాళిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వంశధారలలో రెండు, విక్టరీ కళాశాలల్లో కేంద్రాలను కేటాయించామన్నారు. నిర్ణీత సమయానికి అభ్యర్థులు, సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: లఖందిడ్డి పంచాయతీలో ఈ నెల 23వ తేదీ నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నందున లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సచివాలయ సిబ్బందికి సూచించారు. లఖందిడ్డి సచివాలయం సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి చెందిన డేటాతో హాజరు కావాలని, ప్రతి సమస్యకూ పరిష్కారం చూపేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, బి.గణపతిస్వామి, వీఆర్వో సూర్యనారాయణ, సచివాలయం కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు పాల్గొన్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం



వైద్య శిబిరంలో ఎంపీపీ దాస్ తదితరులు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సోంపేటలో ఉచిత మెగా గుండె వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. విశాఖకు చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.పాల్ కిరణ్, పలువురు వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 250 మంది రోగులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయిస్తామని ఎంపీపీ దాస్ చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు మల్లా యుగంధర్, కార్యదర్శి బెల్లాన శ్రీకాంత్, సంఘప్రతినిధులు మల్లా వెంకటరమణ, నగిరి శరత్, టంకాల వెంకటరమణ, వద్ది శివశంకరరావు, ఊనా సూర్యారావు పాల్గొన్నారు.

శక్తి వనరుల వినియోగంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ఇచ్ఛాపురం: మానవుడికి సహజసిద్ధంగా లభించే శక్తి వనరుల వినియోగాన్ని తగ్గించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని.. లేనిచో భవిష్యత్‌లో ఎన్నో విపత్కర పరిస్థితులు ఎదురవుతాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ అన్నారు. ఆదర్శ పాఠశాల ఎనర్జీక్లబ్ ఆధ్వర్యంలో పురుషోత్తపురం గ్రామంలో శక్తివనరుల వినియోగంపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శక్తి వనరుల వినియోగం గతంకంటే ఇప్పుడు చాలా ఎక్కువగా పెరిగిందన్నారు. వాటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా శక్తి పరిరక్షణ చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, అధ్యాపకులు సీహెచ్ వాసుదేవరావు, రమణ, రామకృష్ణ, పీడి సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా ఆర్‌ఎంపీ సేవా గుణం

- అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో ఆర్‌ఎంపీ జ్యోతి తదితరులు

కాశీబుగ్గ: మహిళా ఆర్‌ఎంపీ సేవా గుణాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజుల క్రితం ఇచ్ఛాపురం పట్టణంలో అనారోగ్యంతో పడి ఉన్న అనాథను కొంతమంది యువకులు పోలీసులకు అప్పగించారు. వారు అతన్ని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని లలితాశ్రమంలో చేర్పించారు. అయితే ఆ వ్యక్తి శనివారం కన్నుమూశారు. మృతి చెందిన వ్యక్తి అనాథ కావడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపాలిటీకి చెందిన మహిళా ఆర్‌ఎంపీ మెట్ట జ్యోతి స్పందించారు. మామిడి వెంకటరమణతో పాటు మరికొంతమంది సహకారంతో మృతదేహాన్ని కోసంగిపురం సమీపంలోని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆర్‌ఎంపీ జ్యోతిని స్థానికులు అభినందించారు.

కోటబొమ్మాళి ఏజీపీకి అదనపు బాధ్యతలు



తిరుపతి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఏజీపీ (ప్రభుత్వ న్యాయవాది) సంపతి రావు తిరుపతికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. సోంపేట, పలాస, ఇచ్ఛాపురం కోర్టులకు కూడా ఏజీపీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, కొత్తూరు కోర్టులకు కూడా తిరుపతి ఏజీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

11న లోక్ అదాలత్



మాట్లాడుతున్న రవిశంకర్

కాశీబుగ్గ: వచ్చేనెల 11వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ పి.రవిశంకర్ అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల పరిష్కారం కోసం లోక్‌అదాలత్ చక్కని వేదికని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిష్కరించేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండ్ర మురళీమోహన్, కార్యదర్శి పిండి వెంకటరావు, న్యాయవాదులు పి.లక్ష్మీనారాయణ, పి.రాజరత్నం, జీఎంఎస్ ఆనిల్‌రాజ్, బి.కె.ఆర్.పట్నాయక్, కోత రజనీ కుమార్, ఏజీపీ దేవరాజ్, చిట్టిబాబు, ప్రభాకర్, శ్యాం, రవికుమార్, బి.లక్ష్మి, కోర్టు సూపరిటెండెంట్ పి.పాణిగ్రాహి, వజ్రపుకొత్తూరు ఎస్సై మధుసూదన్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ల పదవుల పొడిగింపుపై హర్షం

కోటబొమ్మాళి: బీసీ కార్పొరేషన్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై కోటబొమ్మాళి మండలం రేగులపాడు, దంత గ్రామాలకు చెందిన వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు దుంగ శిమ్మన్న, వెలమల ఆదినారాయణ, కమలనాభపురం గ్రామానికి చెందిన కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రికి ధన్యావాదాలు తెలియజేశారు. బీసీ కులాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంతోషం



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త సాయిరాజ్

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- కవిటి –2 సచివాలయం పరిధిలో 'గడప పగపకు మన ప్రభుత్వం'

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో సంతోషం కనిపిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటి –2 సచివాలయం పరిధిలోని 8, 9, 10, 13వ వార్డుల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వ ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల్లో సంతోషం నింపడానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదల పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణారావు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, ఎం.శంకర్‌ప్రధాన్, పార్టీ నాయకులు దుద్ది ధర్మారావు, రమణ, దువ్వు కృష్ణారావు, ఎలమంచి నీలయ్య, జల్లు యుగంధర్, బడ్డాయి మురళి, కర్రి శేషయ్య పాల్గొన్నారు.

సీఎం జగన్ హయాంలో రామరాజ్యం



పెద్దతామరాపల్లిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- పెద్దతామరాపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నందిగాం: నాడు శ్రీరామచంద్రమూర్తి పాలనను మనం స్వయంగా చూడలేదని కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న పాలనలో రామరాజ్యం చూస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. పెద్దతామరాపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొయిన్‌వీధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు, కష్టాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేకూరిన లబ్ధిని వివరించి..అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. తమ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న తమ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు అనవసరంగా బురద జల్లేందుకు చూడడం తగదన్నారు. జగనన్న ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పెద్దతామరాపల్లికి చెందిన ఆ పార్టీ నాయకుడికి మూడేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ.5 లక్షలు లబ్ధి చేకూరిందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పారదర్శక పాలనకు ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తమిరె సుధారాణి, నాయకుడు దేవేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సైలాడ లావన్న, నాయకులు యర్ర చక్రవర్తి, జడ్యాడ జయరాం, పోలాకి మోహనరావు, రేగల కూర్మారావు, కణితి నారాయణమూర్తి, టొంప రామారావు, తమిరె బలరాం, తమిరె ఫాల్గుణరావు, నాగా రామారావు, కవిటి వీరయ్య, బాబూరావు, లక్ష్మణ్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

కంచిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా చేపట్టాలని లబ్ధిదారులకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సూచించారు. మండపల్లి గ్రామంలోని జగనన్న కాలనీ లే అవుట్ వద్ద శనివారం హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలు పథకాల్లో భాగమైన జగనన్న కాలనీలను డిసెంబర్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రారంభించిన నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఏమైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించుకొని ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రస్తుతం గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అలాగే వైఎస్సార్‌కేపీ ద్వారా రుణాన్ని కూడా స్వయంశక్తి సంఘాల సభ్యులు పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా మండపల్లి లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకొని అధికారులతో ఎంపీపీ చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, నాయకుడు క్రిష్ణారావు, తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ అప్పారావు, ఏపీఎం ఉమారాణి, తలతంపర సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామూర్తి జయంత్యోత్సవం



శ్రీరామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి చిన్నబ్రాహ్మణ వీధిలో శ్రీకంచి కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణులు ఆణిముత్యం పండిత గానాల శ్రీరామూర్తి 132వ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అండాలూరు కోటిఆచారి, ఉపాధ్యక్షుడు భవిరి గోపాలకృష్ణచారి, గౌరవ అధ్యక్షుడు పొట్నూరు కన్నాచారి, సెక్రటరీ లక్కోజు సంతోష్ పాల్గొన్నారు.

ఆధ్యకళా ప్రదర్శన అదరహో..



రామాయణం, భాగవత గ్రంథాలు

పలాసలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమైన ఉత్తరాంధ్ర రచయితల మహాసభలో వివిధ ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచే అతి పురాతన వస్తువులు, ఆదికాలం నాటి గ్రంథాలు, అలనాటి అరుదైన పరికరాలు ప్రదర్శనలో ఉంచారు. ఆధ్యకళా సేకరణ కర్త డాక్టర్ జయధీర్ తిరుమలరావు ప్రదర్శనను చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఈయన ప్రముఖ యూనివర్సిటీల్లో అధ్యాపకునిగా పనిచేసి గత 40 ఏళ్లుగా వీటిని సేకరిస్తూ వస్తున్నారు. సుమారు 300 ఏళ్ల క్రితం నాటి కుల, ప్రాంత చరిత్రలు, ఆరోగ్య పరమైన మందులు, రాతలు, బొమ్మలు ప్రదర్శనలో ఉంచగా.. వందలమంది వీటిని తిలకించారు.

– కాశీబుగ్గ



పురాతన కాలంలో వాడే సీరా నిల్వలు



పురాతన తాళ్లపత్ర గ్రంథాలు



చెక్కపై పదిలంగా చరిత్రలు..